క్లుప్తంగా

అగస్త్య పీఠంలో రథసప్తమి వేడుకలు

నరసింహారావుపాలెం(వీరులపాడు): మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలోని అగస్త్య పీఠంలో రథసప్తమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పీఠంలో ఉన్న గాయత్రి మాతను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం పీఠాధిపతి సుగుణానంద స్వామీజీ ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు, హోమాది క్రతువులు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, నాయకులు పచ్చల కోటేశ్వరరావు, పసుపులేటి సాయిబాబు, పలువురు నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పలు ఆలయాలలో రథసప్తమి ప్రత్యేక పూజలు

నందిగామ: రథసప్తమి నేపథ్యంలో శనివారం పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు జరిగాయి.పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. నెహ్రూనగర్ లోని వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణ శివారు పల్లగిరి గుట్టపై గల త్రిశక్తి పీఠం, కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం, లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాలలో జరిగిన పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

31న కౌన్సిల్ బడ్జెట్, సాధారణ సమావేశాలు

జగ్గయ్యపేట అర్బన్: పేట మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక బడ్జెట్ సమావేశం, సాధారణ సమావేశం ఈనెల 31 వ తేదీన నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శనివారం తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఉదయం 11 గంటలకు జరిగే ప్రత్యేక సమావేశంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను పేట మున్సిపాలిటీ నిధులకు సంబంధించి తయారుచేసిన బడ్జెట్ అంచనాలు, 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తయారుచేసిన సవరించిన బడ్జెట్ అంచనాల ఆమోదం నిమిత్తం అజెండా సిద్ధం చేసినట్లు తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగుతుందని తెలిపారు. పలు అభివృద్ధి పనులు, పరిపాలనకు సంబంధించిన కేటాయింపులు తదితర 27 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం సిద్ధం చేసినట్లు తెలిపారు. గౌరవ కౌన్సిల్ సభ్యులు, గౌరవ ఎక్స్–అఫిషియో మెంబర్లు హాజరుకావాలని కోరారు.

అదుపు తప్పిన బైకు : ఒకరికి తీవ్ర గాయాలు

నందిగామ: ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం నందిగామ మండలంలో జరిగింది. సేకరించిన సమాచారం ప్రకారం గొల్లమూడి గ్రామానికి చెందిన షేక్ బాబు సాహెబ్ తన ద్విచక్ర వాహనంపై నందిగామ పట్టణానికి వస్తున్నాడు.ఈ తరుణంలో పల్లగిరి సమీపంలో మలుపు వద్ద బాబుసాహెబ్ ప్రయాణం చేస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న బోరు పంపునకు ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన బాబుసాహెబ్‌ను 108 వాహనంలో నందిగామ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కంచికచర్ల(వీరులపాడు): మానసిక వ్యాధితో బాధపడుతూ చెత్తకుప్పలో దొరికే పదార్థాలు తిని అనారోగ్యం బారిన పడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపిన సమాచారం మేరకు మండలంలోని పెండ్యాల గ్రామానికి చెందిన షేక్ కరీమియా (27) కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతూ గ్రామంలో బిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం గ్రామంలోని రహదారి వెంబడి చెత్త కుప్పల్లో దొరికిన పదార్థాలు తిని అనారోగ్యానికి గురై అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన గ్రామస్తులు వ్యక్తిని నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించటంతో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సాయంత్రం సమయంలో మృతి చెందినట్లు తెలిపారు.

2న కూడలి సంగమేశ్వర స్వామి ఆలయంలో వేలం

నందిగామ: మండల పరిధిలోని దాములూరు గ్రామంలో ఉన్న కూడలి సంగమేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా లడ్డూ ప్రసాదం విక్రయం, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు కోసం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వి.భూపాల్, ధర్మకర్తల మండలి చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మహా శివరాత్రి వేడుకలు, స్వామి వారి కల్యాణోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 17 నుంచి 20వ తేదీ వరకు ఆలయంలో లడ్డూ ప్రసాదం విక్రయం, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు కోసం ఫిబ్రవరి 2వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.5 వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని సూచించారు.

జాబ్ మేళాతో నిరుద్యోగులకు చేయూత

నందిగామ: చదువుకున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో పలు శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయడం, కొత్త ఉద్యోగాలకు శ్రీకారం చుట్టడం లాంటి కార్యక్రమాలు చేస్తోంది. దీంతోపాటు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా జాబ్‌మేళాలు పెట్టించి ప్రైవేటు సెక్టార్‌లో కూడా ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. జాబ్‌మేళాలో ఒకే వేదికపై అనేక కంపెనీలకు చెందిన ప్రతినిధులు నిరుద్యోగులను ఇంటర్వ్యూలు చేసి అర్హులైన వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. ప్రభుత్వం అన్ని ప్రాంతాలలోనూ ఈ తరహా జాబ్ మేళాలు నిర్వహిస్తోంది.

నందిగామలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ సహకారంతో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్‌మేళాకు వివిధ ప్రాంతాల నుంచి 946 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. మొత్తం 22 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై మౌఖిక ఇంటర్వ్యూలు నిర్వహించారు.


నందిగామలో నిర్వహించిన జాబ్ మేళాలో పాల్గొన్న యువతీ, యువకులు

అమ్మ మరియమ్మ స్ఫూర్తితో... అమ్మ కస్తాల మరియమ్మ స్ఫూర్తితో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో ప్రతి ఇంట్లో చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగం కల్పించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నారు. ఈ కృషిలో భాగంగానే ఇప్పటికే లక్షల రూపాయలు వెచ్చించి పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉచితంగా భోజన వసతులతో పాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. అదే తరహాలో జాబ్ మేళాలు కూడా నిర్వహిస్తున్నారు.



అర్హత ఉంటే ఉద్యోగం రావాల్సిందే

చదువుకుని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగం రావాలన్నదే మా లక్ష్యం. ఈ నేపథ్యంలోనే నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్ రావుతో పాటు నేను కూడా కృషి చేస్తున్నాను. నియోజకవర్గంలో చదువుకున్న వారెవరూ నిరుద్యోగులుగా ఉండకూడదనేదే మా లక్ష్యం.

– మొండితోక అరుణ్ కుమార్, ఎమ్మెల్సీ



జాబ్‌మేళాతో ఉద్యోగం తథ్యం

గత 30 ఏళ్లుగా ఈ తరహా కార్యక్రమాలు ఎవరూ పెట్టలేదు. శిక్షణ తరగతులు, జాబ్‌మేళాల ద్వారా ఎంతోమంది యువతీ, యువకులకు ప్రభుత్వ ఉద్యోగమో, ప్రైవేటు ఉద్యోగమో ఏదో ఒకటి దొరుకుతుంది. ముందు ఏదో ఒక ఉద్యోగంలో చేరితే, తర్వాత నిదానంగా ఉన్నత స్థాయికి ఎదగవచ్చు.

– అమరనేని రమేష్ బాబు, కళాశాల అధినేత



నాకు చాలా సంతోషంగా ఉంది

నేను బీటెక్ పూర్తి చేశాను. ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేస్తున్నాను. ఈ తరుణంలో ప్రభుత్వం నందిగామ లోనే మెగా జాబ్ మేళా నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది. పలు కంపెనీలకు చెందిన ఇంటర్వ్యూలకు నేను హాజరయ్యాను. ఏదో ఒక దాంట్లో ఉద్యోగం సంపాదించుకోగలుగుతాననే ధైర్యం వచ్చింది.

– జి.నాగజ్యోతి, నందిగామ

మహిళ, శిశు సంరక్షణకు అధిక ప్రాధాన్యం

నందిగామ టౌన్: మహిళ, శిశు సంరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. ఇటీవల నూతనంగా ఎంపికైన అంగన్‌వాడీ కార్యకర్తలకు స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం రాత్రి ఆయన నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ వ్యవస్థలో సమూల మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అంగన్‌వాడీలకు వేతనాలు పెంచిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని తెలిపారు. అంగనవాడీ కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించటంతో పాటు ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీలు గ్రామాలలో తిరుగుతూ గర్భిణులు, బాలింతలను గుర్తించి పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కలిగించాలని సూచించారు. అనంతరం ఐదుగురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఒక ఆయాకు ఆయన నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో భాగ్యరేణుక, పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


నియామకపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

ఉపాధి పథకం పనుల్లో అభ్యంతరాలు తెలపాలి

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో ఏవైనా అభ్యంతరాలుంటే గ్రామ సభల్లో తెలియజేయాలని ఉపాధి హామీ పథకం కోఆర్డినేటర్ రవీంద్ర అన్నారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ గ్రామ సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020–22 ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో అనేక ఉపాధి హామీ పనులు జరిగాయన్నారు.

కూలీలు పనుల్లో పాల్గొన్నారని అయితే ఏవైనా సమస్యలు, లోపాలను తెలపాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడారు పేరయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా దుర్గ, ఎఫ్ఏ నాగరాజు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కోఆర్డినేటర్ రవీంద్ర

రాష్ట్రంలో అందరికీ సొంతిల్లు సీఎం లక్ష్యం

గృహ నిర్మాణాలపై ఎమ్మెల్యే సమీక్ష

నందిగామ టౌన్: రాష్ట్రంలో సొంతిల్లు లేకుండా ఏ వ్యక్తి ఉండకూడదనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలపై స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నాలుగు మండలాల అధికారులతో ఆర్డీవో రవీంద్రతో కలిసి శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మందికి పైగా ఇళ్ల స్థలాలు అందించి ఇళ్లు మంజూరు చేశారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు అందించామని చెప్పారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

గ్రామాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయలని జగన్‌మోహనరావు అన్నారు. ఎవరికైనా అర్హత ఉండి ఇళ్ల స్థలాలు మంజూరు కాకుండా తక్షణమే స్థలాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాంకేతిక సమస్యలు తదితర కారణాలు ఏవైనా ఉంటే వాటిని అధిగమించి అర్హులకు లబ్ధి చేకూర్చాలని తెలిపారు. ఆయా గ్రామాల్లోని జగనన్న కాలనీలలో చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలని కోరారు. సమావేశంలో నగర పంచాయతీ కమిషనర్ జయరాం, తహసీల్దార్‌లు నరసింహారావు, రాజకుమారి, సుశీలదేవి, ఎంపీడీవోలు శ్రీనివాసరావు, శిల్ప, అరుంధతీ దేవి, గృహ నిర్మాణ శాఖాధికారులు పాల్గొన్నారు.


గృహ నిర్మాణాలపై సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ప్రతి ఒక్కరికీ ఇల్లు ప్రభుత్వ లక్ష్యం

నందిగామ: ఇల్లు లేని ప్రతి పేదవారికి ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం అన్నారు. పట్టణ పరిధిలోని మునగచర్ల లేఅవుట్ వద్ద శనివారం లబ్ధిదారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణ పురోగతిని అడిగి తెలుసుకోవడంతో పాటు, లబ్ధిదారుల కున్న సమస్యలు, అనుమానాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి పేదవానికి ఇల్లు నిర్మించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. ఈ తరుణంలో ప్రతి లేఅవుట్ లోనూ నివాసితులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, గృహ నిర్మాణ శాఖాధికారులు, సచివాలయ, మెప్మా ఉద్యోగులు పాల్గొన్నారు.

యోగాపై విద్యార్థులకు అవగాహన

నందిగామ(చందర్లపాడు): ప్రతి ఒక్కరికీ యోగా ఎంతగానో మేలు చేస్తుందని యోగా గురువు కొత్తూరి సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని రామన్నపేట గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించడంతో పాటు, సూర్య నమస్కారాల ప్రత్యేకతను తెలియజేశారు. ఈ సందర్భంగా యోగా గురువు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే యోగా అవసరం అన్నారు. ముఖ్యంగా విద్యార్థి దశ నుంచి యోగా చేయడం వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. అనంతరం పలు ఆరోగ్య సూత్రాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయిస్తున్న యోగా గురువు

రైతులకు భూహక్కు పత్రాల పంపిణీ

కంచికచర్ల(వీరులపాడు): రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని తహసీల్దార్ రాజకుమారి అన్నారు. భూసర్వే పూర్తవటంతో మండలంలోని పరిటాల వీఆర్వో కార్యాలయంలో రైతులకు భూహక్కు పత్రాలను శనివారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్దాల కాలం తరువాత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూముల రీ సర్వే నిర్వహించిందన్నారు. గ్రామంలో 1548 మంది రైతులకు భూహక్కు పత్రాలు మంజూరవగా వాటిలో 660 మంది రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సర్వేలో ఏమైనా తప్పులు దొర్లితే రైతులు ఆందోళన పడాల్సిన పని లేదని ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆనందజ్యోత్స్న వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహాకుంభాభిషేక మహోత్సవాలు

నందిగామ: పట్టణంలోని మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆదివారం నుంచి మహాకుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. పట్టణంలోని పురాతన ఆలయాలలో ఒకటైన మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఈ వేడుకలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయాన్ని, పరిసర ప్రాంతాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. మూడు రోజులపాటు నిత్యం ప్రత్యేక పూజలు, హోమాది కార్యక్రమాలు జరగనున్నాయి. భారీగా భక్తులు తరలివచ్చే నేపథ్యంలో నిర్వాహకులు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేశారు.

భక్తిశ్రద్ధలతో భావనారుషి స్వామి కల్యాణం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి పద్మశాలీ వీధిలో శ్రీశ్రీ భద్రావతి సమేత భావనారుషి దేవాలయంలో స్వామివార్ల కల్యాణ మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. అర్చకులు శేషాచార్యులు ఆధ్వర్యంలో చెరుకు రామకృష్ణ, మాధవి, మెట్టుకోలు వెంకటేశ్వరరావు, నాగమణి దంపతులు వేదమంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం జరిపించారు. అనంతరం పది రకాల హారతులతో స్వామివార్లకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 3 వేల మంది భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పుల్లారావు, చెరుకు నరసింహారావు, సీహెచ్ మాదవరావు, లక్ష్మీకాంతారావు, భక్తులు పాల్గొన్నారు.

జి.కొండూరు: మండల పరిధి వెలగలేరు గ్రామంలో శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామి వారి కల్యాణం ఆలయ ప్రాంగణంలో శనివారం వైభవంగా జరిగింది. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 2 వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ చైర్మన్ జి.రాంబాబు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

జడ్జి షేక్ షిరీన్



మైలవరం: విద్యార్థులకు చదువుతో పాటు చట్టాలపై కూడా అవగాహన ఉండాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి షేక్ షిరీన్ పేర్కొన్నారు. సుప్రీం కోర్టు జాతీయ లీగల్ సర్వీస్ అథారిటీ పిలుపు మేరకు మైలవరం మండలం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎస్‌కే హైస్కూల్‌లో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మైలవరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బుద్ధవరపు వెంకట్రావు సమావేశానికి అధ్యక్షతన సమావేశం జరిగింది. సదస్సులో జడ్జి షేక్ షిరీన్ మాట్లాడుతూ 14 సంవత్సరాల లోపు బాల బాలికలకు ప్రభుత్వం ఫీజులు లేకుండా నిర్బంధ విద్యా విధానం అమలు చేస్తుందన్నారు. తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని అన్నారు. సమస్య ఉన్నపుడు పోలీసులకు, 101కు ఫోన్ చేయాలని విద్యార్థులకు ఆమె సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గునగంటి శ్రీనివాసరావు, ఎస్ఎస్‌కే విద్యా సంస్థల అధినేత గొల్లపూడి మోహనరావు, ఉపాధ్యాయులు బాబూజీ, జూనియర్ న్యాయవాది ఎం.తనూజ్ తదితరులు పాల్గొన్నారు.

మండలానికి అగ్నిమాపక కేంద్రం అవశ్యం

పెనుగంచిప్రోలు: నిత్య యాత్రాస్థలంగా ఉన్న పెనుగంచిప్రోలు మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం వెంటనే ఏర్పాటుచేయాలని భక్తులు కోరుతున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని మూడు మండలాలకు కలిపి జగ్గయ్యపేటలో ఒకే ఒక ఫైర్ ఇంజన్ ఉంది. ముఖ్యంగా నిత్యయాత్రాస్థలమైన పెనుగంచిప్రోలుకు ఫైర్ ఇంజన్ అవసరమని ప్రజలు అంటున్నారు. ఆలయం వద్ద అమ్మవారికి పొంగళ్లు చేయటం అనాదిగా వస్తున్న ఆచారం. గ్యాస్ పొయ్యిలు, కట్టెల పొయ్యిలు వాడుతుంటారు. గురువారం రాత్రి ఆలయం వద్ద 19 దుకాణాలకు మంటలు చెలరేగి బూడిదయ్యాయి. సుమారుగా రూ.60 లక్షల నష్టం వాటిల్లింది. గతంలో 2018 మార్చి4న శ్రీతిరుపతమ్మ వారి చిన్న తిరునాళ్ల సమయంలో మునేరులో పాకలు వేసుకొని చిరువ్యాపారాలు నిర్వహించుకునే వారి పాకలో గ్యాస్ లీకై వ్యాపించిన మంటలు 50 దుకాణాలకు విస్తరించి క్షణాల్లో బూడిదయ్యాయి. ఆ సంఘటనలో సుమారు రూ.50 లక్షల ఆస్తినష్టం సంభవించింది. ఈ రెండు ప్రమాదాల్లో ప్రాణనష్టం లేకపోవటం కొంతలో కొంత నయం. ఆలయం వద్ద గతంలో కూడా రెండు మూడు అగ్ని ప్రమాదాలు జరిగాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పెనుగంచిప్రోలు మండల కేంద్రంలో ఒక ఫైర్ ఇంజన్ ఉంటే ప్రమాదాల తీవ్రత తగ్గుతుందని ప్రజలు అంటున్నారు. శుక్రవారం అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించేందుకు గ్రామానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుకు ఫైర్ ఇంజన్ అవసరం గురించి తెలియజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి అధికారులతో సమీక్షించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.


ఆలయం వద్ద మునేరులో 2018లో కాలిపోయిన పాకలు(ఫైల్)

అవగాహన లేకపోవడం కూడా...

అగ్ని ప్రమాదాలపై ప్రజలకు కూడా సరైన అవగాహన లేకపోవటం ప్రమాదాల తీవ్రతకు కారణమవుతోంది. గ్యాస్ లీకైన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన ఉండాలి. లేకపోతే పరిస్థితి దారుణంగా ఉంటుంది. దుకాణదారులు కూడా దుకాణాలు కేవలం వ్యాపారాలకు వినియోగించకుండా నిబంధనలు అతిక్రమించి గ్యాస్ పొయ్యిలు ఏర్పాటు చేయటం, విద్యుత్ వినియోగంలో అజాగ్రత్తలు, ఇచ్చిన దుకాణానికి అదనంగా షెడ్లు ఏర్పాటు చేసి పరదాలు కట్టటం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం వద్దు

కమిషనర్ డాక్టర్ జయరాం

నందిగామ: పారిశుద్ధ్యం విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం అన్నారు. పట్టణంలోని ఏడవ వార్డు పరిధిలో వైస్ చైర్‌పర్సన్ మాడుగుల నాగరత్నంతో కలిసి శనివారం ఆయన పర్యటించారు.

ఈ సందర్భంగా ఆ ప్రాంతంలోని పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఈ నేపథ్యంలో సిబ్బంది కూడా పారిశుద్ధ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ప్రజలు కూడా సిబ్బందికి సహకరించాలన్నారు. దోమల నివారణకు కూడా చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఏడవ వార్డు పరిధిలో పరిస్థితిని పరిశీలిస్తున్న కమిషనర్ జయరాం

ఏర్పాట్ల విషయంలో రాజీ పడొద్దు: ఆర్డీఓ రవీంద్రరావు

నందిగామ: స్థానిక రామలింగేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవ ఏర్పాట్ల విషయంలో రాజీ పడొద్దని ఆర్డీఓ రవీంద్రరావు ఆలయ అధికారులకు సూచించారు. పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి కల్యాణ వేడుకలు ఈనెల 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఏర్పాట్లపై శనివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పలు శాఖల అధికారులతో కలిసి ఆర్డీఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా స్వామి వారి కల్యాణం, రథం ఊరేగింపునకు సంబంధించిన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహారావు, ఆలయ చైర్మన్ వాసిరెడ్డి మురళీ రాఘవ కుమార్, ఈవో ధూళిపాళ్ల సుబ్రహ్మణ్యం, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రవీంద్రరావు

జగనన్న కాలనీల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు

బూదవాడ(జగ్గయ్యపేట): గ్రామాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిరుపేదలకు నిర్మిస్తున్న జగనన్న కాలనీలలోని గృహాలలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామని మండల ప్రత్యేకాధికారి బాలాజీ కుమార్ తెలిపారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న జగనన్న గృహాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీలలో మౌలిక వసతులను పూర్తి స్థాయిలో కల్పిస్తామని చెప్పారు. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. గృహ నిర్మాణ లబ్ధిదారులు కూడా గృహాలను పూర్తి స్థాయిలో నిర్మాణాలు చేయాలని చెప్పారు. బండిపాలెం లేఅవుట్‌ను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయచంద్ర, ఏఈ ప్రకాశరావు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.


బూదవాడలో జగనన్న కాలనీని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి బాలాజీకుమార్

కంటైనర్ సబ్ స్టేషన్‌తో నిరంతర విద్యుత్ సరఫరా


కంటైనర్ సబ్ స్టేషన్ వద్ద సీఎండీ పద్మజనార్ధన్‌రెడ్డి, ఇతర అధికారులు

ఏపీసీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మ జనార్ధన్‌రెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి శ్రీనివాసనగర్‌లో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ కంటైనర్ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఏపీసీపీడీసీఎల్ సీఎండీ జె. పద్మ జనార్ధన్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ స్టేషన్ నిర్మాణ పనులన్నీ పూర్తయ్యాయని, త్వరలో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. లాంకో కాలనీ, సాయిపురం కాలనీ, శ్రీనివాసనగర్, పంట కాలువ రోడ్, గొల్లపూడి బైపాస్ రహదారి, అట్కిన్‌సన్ స్కూల్ రోడ్ ఏరియా వినియోగదారులకు నాణ్యమైన నిరంతరాయ విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఈ కంటైనర్ సబ్ స్టేషన్‌ను నిర్మించామని వివరించారు. కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ బి.జయభారత్‌రావు, విజయవాడ టౌన్ డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్, కన్‌స్ట్రక్షన్ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎం.వసంతరావు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com